క్లుప్తంగా

వైఎస్సార్ బీమా నగదు అందజేత



రాజుపాలెం: మండలంలోని రాజుపాలెంకు చెందిన కేదారి శ్రీనివాసరావు అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. దీనికి గాను వైఎస్సార్ బీమా ద్వారా రూ.లక్ష మంజూరయ్యాయి. మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10వేలను భార్య నాగలక్ష్మికి సర్పంచ్ పులిబండ్ల అశోక్, ఎంపీటీసీ బత్తుల సాంబశివరావు, జీడీసీఎంసీ డైరెక్టర్ పాలవాయి ఆదినారాయణలు గురువారం అందించారు. మిగిలిన రూ.90 వేలు త్వరలో ఖాతాలో జమ అవుతాయని తెలిపారు.

చిరస్మరణీయుడు శంకరంబాడి సుందరాచారి

చిలకలూరిపేట: తెలుగుజాతి గర్వించదగ్గ కవి శంకరంబాడి సుందరాచారి అని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు దార్ల బుజ్జిబాబు చెప్పారు. యడ్లపాడు మండలం మైదవోలు గ్రామంలోని బీసీ కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శంకరంబాడి సుందరాచారి జయంతిని గురువారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగువాడు ఎప్పటికీ గుర్తించుకునేలా రాష్ట్ర గేయం మా తెలుగు తల్లికి మల్లెపు దండ రాసిన కవి సుందరాచారి ధన్యజీవి అని కొనియాడారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గౌరు లక్ష్మయ్య, స్కూల్ హెచ్‌ఎం జీవీ హేమలత తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ల నిర్మాణ పనులకు భూమిపూజ



దాచేపల్లి: ఇంటింటికి తాగునీరు అందిస్తామని సర్పంచ్ కూసం నాగిరెడ్డి అన్నారు. మండలంలోని శ్రీనగర్ గ్రామంలోని ప్రతి ఇంటికి కృష్ణా జలాలు అందించేందుకు రూ.22లక్షల నిధులతో పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులకు గురువారం శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సహకారంతో ఇంటింటికి సురక్షితమైన తాగునీటిని అందిస్తామని, తాగునీటి సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని సర్పంచ్ నాగిరెడ్డి చెప్పారు. త్వరితగతిన ఈ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఎంపీటీసీ ఆకూరి కాశిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మారెడ్డి, ఏఈ అంగడి సోమయ్య, స్థానిక నాయకులు వణుకూరి శంకర్‌రెడ్డి, మందా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి దీక్షను జయప్రదం చేయాలి

గురజాల: సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని పల్నాడు జిల్లా ఫ్యాక్టో చైర్మన్ బెజ్జం సంపత్ బాబు కోరారు. స్థానిక ఏపీ ఎన్‌జీవో హోంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 12వ తేదీ నరసరావుపేట రెవెన్యూ డివిజన్ కార్యాలయం వద్ద జరిగే నిరసన దీక్షను విజయవంతం చేయాలని కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఓ నెంబరు 117ను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ కన్వీనర్ తాళ్లూరి అరుణ్‌కుమార్, కందుకూరి ప్రసాద్, మొగిలి రమేష్, జె.రామారావు, మండల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు ఉచిత రక్త గ్రూపు పరీక్షలు

మాచర్ల: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఈ నెల 12న శనివారం రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి ఆధ్వర్యంలో ఉచితంగా బ్లడ్ గ్రూపులు తెలిపే పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మున్సిపల్ కమీషనర్ ఈవీ రమణబాబులు ప్రారంభిస్తారన్నారు.

ఎన్ఎస్‌పీ కాలనీలో చెట్లు నరికివేత

కారెంపూడి: స్థానిక ఎన్ఎస్‌పీ కాలనీలో భారీ వృక్షాలను నరికి వేస్తున్న ఘటనలు స్థానికులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. కాలనీకి చాలా అందాన్ని, ఆహ్లాదకరమైన వాతావరణం చేకూర్చుతూ సుమారు 70 ఏళ్ల వయసున్న భారీ వృక్షాలను పూర్తిగా తొలగిస్తున్న ఘటనలు చోటు చేసుకున్నాయి. సాక్షాత్తు డీఈ, ఏఈ కార్యాలయం ముందున్న భారీ వృక్షాన్ని పూర్తిగా కొట్టేశారు. అలాగే మరో నాలుగు చెట్లు కొట్టేశారు. ఈ నేపథ్యంలో కాలనీ ఏఈని వివరణ కోరగా గాలులకు కొన్ని కొమ్మలు విరిగిపడ్డాయని దీంతో పాటు భవనాల పైకి వాలిన కొమ్మలను సిబ్బందిని కొట్టమన్నామని, కాని వృక్షాలను పూర్తిగా నరికివేయమనలేదని విచారించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇకపై అలాంటి ఘటనలు పునావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

శారీరక బలహీనతకు నులిపురుగులే కారణం

- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- 75త్యాళ్ళూరు జేబీ పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ



విద్యార్థికి ఆల్బెండజోల్ మాత్ర వేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

పెదకూరపాడు: రక్తహీనత, శారీరక బలహీనతకు నులిపురుగులే కారణమని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. మండలంలోని 75త్యాళ్ళూరు గ్రామంలోని జేబీ పాఠశాలలో గురువారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను అందించారు. అనంతరం శంకరరావు మాట్లాడుతూ 1–2 సంవత్సరాలు వయస్సు కలిగిన వారికి 200 ఎంజీ, 3–19 సంవత్సరాలు వయస్సు కలిగిన వారికి 400 ఎంజీ మాత్రలను అందించాలన్నారు. క్రోసూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, వైద్యులు ప్రియాంక, వెలుగొండరెడ్డి వైద్య సిబ్బంది. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అచ్చంపేటలో...

అచ్చంపేట: చిన్నారులను ఆరోగ్యవంతంగా ఉంచడమే లక్ష్యంగా, నులిపురుగు రహితంగా మార్చడానికి ప్రభుత్వం, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ ద్వారా జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని నిర్వహించడం జరిగిందని వైద్యాధికారి శ్యామల తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీ ప్రాథమిక పాఠశాలలో గురువారం చిన్నారులకు నులిపురుగులను నివారించేందుకు ఆల్‌బెండజోల్ ట్యాబ్‌లెట్స్ మింగించారు. అచ్చంపేట సర్పంచ్ కంబాల వీరబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యులు హెల్త్ ఎడ్యుకేటర్ పార్వతి, వైద్యసిబ్బంది, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ముప్పాళ్లలో...

ముప్పాళ్ళ: జాతీయ నులిపురుగుల నియంత్రణ దినోత్సవంలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ బిళ్లలను గురువారం అందించారు. పీహెచ్‌సీ వైద్యుడు జయకృష్ణప్రవీణ్, వైఎస్సార్ సీపీ నాయకులు ఎంజేఎం రామలింగారెడ్డి, శిరిగిరి గోపాలరావు, ఎంపీడీఓ పి.పుట్టారెడ్డి, ఎంఈఓ ఒంగోలు రాజు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని అన్ని ప్రభుత్వ,



ముప్పాళ్ళలో ఆల్బెండజోల్ మాత్రలు అందిస్తున్న ఎంజేఎం రామలింగారెడ్డి



రాజుపాలెంలో పిల్లలకు మాత్రలు మింగిస్తున్న జిల్లా అడిషనల్ వైద్యాధికారి పద్మావతి

ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలు అందించినట్లు పీహెచ్‌సీ వైద్యురాలు పి.రమాదేవి తెలిపారు. ఆయా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో జరిగిన పంపిణీ కార్యక్రమాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నకరికల్లులో...

నకరికల్లు: నులిపురుగుల నివారణ చేపడితే అనారోగ్య సమస్యలు దరిచేరవని డాక్టర్ వి.శ్రీనునాయక్ అన్నారు. నులిపురుగుల నివారణాదినోత్సవం సందర్భంగా మండలంలోని పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో నులిపురుగుల మందులు, మాత్రలు గురువారం పంపిణీ చేశారు. తహశీల్దార్ కె.నగేష్, ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సర్పంచ్ పరసా అంజమ్మ, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

సత్తెనపల్లిలో...

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): జాతీయ నులిపురుగుల నియంత్రణ దినోత్సవంలో భాగంగా పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలోని విద్యార్థినులకు ఆల్బెండజోల్ మాత్రలు గురువారం మింగించారు. పాఠశాలలోని 800 మంది విద్యార్థినులచే మాత్రలు మింగించి అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యురాలు షేక్‌మెహబూబ్ వివరించారు. పాఠశాల హెచ్‌ఎం జె.మాధవిలత, పీడీ గోవర్ధన, ఏఎన్ఎం రత్నపుణ్యవతి, ఆశ కార్యకర్త ప్రియాంక పాల్గొన్నారు.

అమరావతిలో...

అమరావతి: జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని అమరావతిలోని శ్రీ రామకష్ణ హిందూ హైస్కూల్లో గురువారం నిర్వహించారు. విద్యార్థులచే మండల పరిషత్ అధ్యక్షుడు మేకల హనుమంతరావు నులిపురుగుల నిర్మూలన మాత్రలను మింగించి మండలంలో ఈకార్యక్రమాన్ని ప్రారంభించారు. అత్తలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డి.శివరత్నకుమార్, వైద్యాధికారి ఎం.రవి బాబు ఎంపీడీఓ ఉమాదేవి, ఎంఈవో శివబాబు, హెచ్‌ఎం ఎమ్మెస్సార్ ఆంజనేయులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాజుపాలెంలో...

రాజుపాలెం: ఆల్బెండాజోల్ మాత్రలు పిల్లల మానసిక ఆరోగ్యానికి, పెరుగుదలకు ఎంతగానో దోహద పడతాయని పల్నాడు జిల్లా అడిషనల్ వైద్య ఆరోగ్య శాఖాధికారి పద్మావతి తెలిపారు. మండలకేంద్రంలోని రాజుపాలెం ఎస్సీ కాలనీలో గల ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు గురువారం వైద్య ఆరోగ్య శాకాధికారి ఆల్బెండోజోల్ మాత్రలను వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ మాత్రలు వేసుకోవడం వలన పిల్లల కడుపులో ఉన్న నులిపురుగులు కనుమరుగై పోతాయని తెలిపారు. కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ కేవీ కృష్ణకుమార్, ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు, ఎంఈఓ మల్లికార్జునశర్మలు పాల్గొన్నారు. రాజుపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో సర్పంచ్ పులిబండ్ల అశోక్, ఎంపీటీసీ బత్తుల సాంబశివరావు, జీడీసీఎంసీ డైరెక్టర్ పాలవాయి ఆదినారాయణలు పాల్గొన్నారు.

క్రోసూరులో...

క్రోసూరు: జాతీయ డీవార్మింగ్ డే సందర్భంగా గురువారం మండలంలోని అందుకూరు ఎంపీయూపీ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ డీఎస్.రమాదేవి పాల్గొని 127 మంది విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. ఏఎన్ఎంలు, ఆవ వర్కర్లు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటాం

బెల్లంకొండ, క్రోసూరు మండలాల్లో నారా లోకేష్ యువగళం పాదయాత్ర

పెదకూరపాడు: వైఎస్సార్ సీపీ పాలనలో నష్టపోయిన ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామని టీడీపీ నేత నారా లోకేష్ పేర్కొన్నారు. యువగళం పాదయాత్రలో భాగంగా గురువారం పల్నాడు జిల్లా క్రోసూరు మండలం దొడ్లేరు గ్రామంలో ప్రజలతో ముఖాముఖి నిర్వహించారు. అంతకు ముందు బెల్లంకొండ మండలం చండ్రాజుపాలెం గ్రామంలోని బస కేంద్ర నుంచి పాదయాత్ర కందిపాడు, క్రోసూరు మండలం ఆవులవారి పాలెం, దొడ్లేరు, అనంతవరం మీదగా క్రోసూరు గ్రామ శివారులోని బస కేంద్రం వరకు సాగింది.

గద్దర్ సంతాప సభను జయప్రదం చేయండి

నరసరావుపేట: గద్దర్ సంతాప సభను ఈనెల 13వ తేదీ ఆదివారం ఎన్‌జీవో హోంలో ఉదయం 11గంటలకు నిర్వహిస్తున్నట్లు ప్రజా సంఘాల నాయకు లు వెల్లడించారు. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే సంతాప సభను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో విలేకర్లతో మాట్లాడారు. ప్రజలు,మేధావులు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. పీడీఎం రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వరరావు, జిల్లా నాయకులు నల్లపాటి రామారావు, పీకేఎస్ జిల్లా నాయకులు కంబాల ఏడుకొండలు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు వితరణ

శావల్యాపురం: మండలంలోని బొందిలిపాలెం గ్రామంలోని శ్రీఅడవి పేరంటాళ్లమ్మ తల్లి ట్రస్టు సారథ్యంలో ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందజేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు నూకల శ్రీనివాసరావు గురువారం తెలిపారు. ఈకార్యక్రమంలో కమిటీ సభ్యులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాతృభూమి రుణం తీర్చుకోవాలి

- డ్వామా పీడీ జోసఫ్‌కుమార్
- నా భూమి – నాదేశంలో భాగంగా అమరవీరులకు నివాళి

పెదకూరపాడు: భారతదేశంలో పుట్టిన ప్రతి ఒక్కరు మాతృభూమి రుణం తీర్చుకోవాలని పల్నాడు జిల్లా డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ అన్నారు. పెదకూరపాడులో దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 సంవత్సరాలు అయిన సందర్భంగా నా భూమి- నాదేశం కార్యక్రమంలో భాగంగా భారీ ర్యాలీ నిర్వహించి స్వాతంత్ర్య సమర వీరుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పెదకూరపాడు ఆర్‌సీఎం చర్చి వద్ద దేశం కోసం పోరాడి యుద్ధంలో మృతి చెందిన సయ్యద్ ఖాయ్యూం పేరుతో శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జోసఫ్‌కుమార్ మాట్లాడుతూ పచ్చదనం–పరిశుభ్రత పేరుతో ప్రతి గ్రామంలో మొక్కలు నాటాలన్నారు. ఎంపీడీఓ నరసింహారావు, గ్రామ సర్పంచ్ గుడిపూడి రాజు, ఈఓ శ్రీనివాసరెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ షేక్ మున్ని, ఏపీఓ కోటేశ్వరరావు, ఫీల్డ్ అసిస్టెంట్ గుంటూరు బాబురావు, విశ్రాంత సైనికులు మౌలాలి, గోగులపాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



పెదకూరపాడులో అమరవీరుల శిలఫలాకాన్ని ఆవిష్కరిస్తున్న డ్వామా పీడీ జోసఫ్‌కుమార్

పెదమక్కెనలో నా భూమి–నా దేశం

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): సత్తెనపల్లి మండలంలోని పెదమక్కెన గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నా భూమి - నాదేశం కార్యక్రమం గురువారం జరిగింది. కార్యక్రమంలో భాగంగా గ్రామంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటారు. పాఠశాల ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ యాంపాటి విజయకుమారి, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నకరికల్లులో..

నకరికల్లు: పర్యావరణాన్ని కాపాడడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి అన్నారు. నా భూమి–నాదేశం కార్యక్రమం నకరికల్లులో గురువారం నిర్వహించారు. విద్యార్థులు, అధికారులు కలసి ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నా మట్టి–నా భూమి కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలోను మొక్కలు నాటాలన్నారు. సర్పంచ్ పరసా అంజమ్మ, కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మి, ఏపీఓ రామకృష్ణ పాల్గొన్నారు.

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): కేంద్ర ప్రభుత్వం పిలుపు మేరకు మన భూమి- మన దేశం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నారాయణ స్కూల్ విద్యార్థులు రోగులకు పండ్లు, మొక్కలు నాటే కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న హాస్పిటల్ సూపరింటెండెంట్ లక్ష్మణరావు మాట్లాడుతూ చిన్న వయసులో సేవాదృక్పథం అలవర్చుకోవటం శుభపరిణామమన్నారు. భాగంగా ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్తరామకృష్ణ, స్కూల్ ప్రిన్సిపాల్ నరసింహారావు, నర్సింగ్ సూపరింటెండెంట్ రాధ, జోనల్ కో–ఆర్డినేటర్ భద్రారెడ్డి పాల్గొన్నారు.

జవాబుదారీతనం కోసమే సామాజిక తనిఖీ

అమరావతి: గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ కూలీల వలసలను నివారించటానికి అమలు చేస్తున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఖర్చు చేసిన ప్రజాధనానికి పథకంలో పనిచేసే ప్రతి ఒక్కరు జవాబుదారీగా ఉండాలని ఎంపీపీ మేకల హనుమంతరావు పేర్కొన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సామాజిక తనిఖీ కార్యక్రమానికి ఎంపీడీఓ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ జోసెఫ్‌కుమార్ పాల్గొని రికార్డులను పరిశీలించారు. అనంతరం జోసెఫ్‌కుమార్ మాట్లాడుతూ పథకంలో పొరబాట్లను సరిదిద్ది సమర్థవంతంగా నిర్వహించటానికి ప్రతియేటా సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నామన్నారు. కోట్లరూపాయలను ఈపథకం ద్వారా ఖర్చు చేసి వేలాది పేద కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్నామన్నారు. సామాజిక తనిఖీ ద్వారా క్షేత్రస్థాయిలో జరిగే చిన్నచిన్న పొరపాట్లను సరిచేసుకోవచ్చన్నారు. పలు గ్రామాలలలో పొరబాట్లు జరిగినట్లుగా గుర్తించామని వీటిని సంబంధిత సిబ్బంది నుంచి రూ.7వేలు అపరాధ రుసుముగా రికవరీ చేస్తామన్నారు. అలాగే కూలీలకు చెల్లించాల్సిన చెల్లింపులు, వారి సమస్యలను రెండుమూడురోజులలోగా పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. ఈకార్యక్రమంలో ఏపీఓ జి.సుభ, వివిధ గ్రామాల పంచాయతి కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు హాజరైనారు.

ఆపదలో ఆపన్నహస్తం సీఎంఆర్ఎఫ్

పెదకూరపాడు: ఆపదలో ఉన్న పేద ప్రజలకు ఆపన్న హస్తం సీఎం రిలీఫ్ ఫండ్ అన్ని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. నియోజకవర్గంలో పలువురు బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను గురువారం ఎమ్మెల్యే అందజేశారు. అమరావతి మండలం మల్లాది గ్రామానికి చెందిన గోనెల శివాజికి రూ.43,000, అమరావతికి చెందిన లక్ష్మీశారదకు రూ.55,000 , క్రోసూరు మండలం దొడ్లేరు గ్రామానికి చెందిన సయ్యద్ మహ్మమద్‌కు రూ.45,000 పెదకూరపాడు మండలం లగడపాడు గ్రామాని చెందిన మైనేని సతీష్‌కురూ.18,000 చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో మంది పేదల జీవితాల్లో వెలుగులు నింపుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.



సీఎం సహాయ నిధి చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నాయకులు

క్రోసూరు: మండలంలోని బాలెమర్రు గ్రామానికి చెందిన టీడీపీ ముఖ్యనాయకులు ఇరువురు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో గురువారం వైఎస్సార్ సీపీలో చేరారు. మండలంలోని బాలెమర్రు గ్రామానికి చెందిన తాళ్లూరి లక్ష్మీనారాయణ, తాళ్లూరి గంగాధరరావులు గుంటూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో పార్టీలో చేరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు వారికి పార్టీలు కండువాలు వేసి ఘనంగా స్వాగతించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ఎల్లప్పుడు కార్యకర్తలకు అండగా నిలుస్తుందని అన్నారు. తాను ఏ సమయంలోనైనా పార్టీ కార్యకర్తలకు వెన్నంటి ఉంటానని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిఒక్కరు పార్టీకోసం కష్టపడి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని, తనను ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఒకదానికొకటి ఢీకొన్న నాలుగు వాహనాలు

నకరికల్లు: రోడ్డుప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన స్థానిక అద్దంకి–నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారిపై వై.జంక్షన్ వద్ద గురువారం జరిగింది. సంఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలాఉన్నాయి. పిడుగురాళ్ల వైపు సుమారు 30 మందితో డోర్లు తెరుచుకొని వెళ్తున్న ట్రాక్టర్ రోడ్డుపక్కన ఆగింది. ఈ క్రమంలో నరసరావుపేట నుంచి పిడుగురాళ్ల వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ప్రయాణికులను దించేందుకు డ్రైవర్ స్లో చేశాడు. ఈ క్రమంలో అటువైపే వెళ్తున్న లారీ ఆర్టీసీ బస్సును వెనుక వైపు ఢీకొట్టింది. దీంతో అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ క్రమంలో పిడుగురాళ్ల వైపే వస్తున్న మరో లారీ డ్రైవర్ ఆందోళనకు గురై పక్కకు తప్పించే ప్రయత్నంలో లారీ డివైడర్ పైకెక్కింది. ఘటనలో గురజాలకు చెందిన ట్రాక్టర్‌లోని ప్రయాణికుడు ఎం.కృష్ణకు తీవ్రగాయాలు కాగా, బస్సులో తనిఖీ చేసేందుకు ఎక్కిన సిబ్బంది ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. నాలుగు వరుస ప్రమాదాలకు స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని క్షతగాత్రులను నరసరావుపేటలోని వైద్యశాలకు తరలించారు. ప్రమాదానికి గురైన వాహనాలకు పక్కకు తీయించి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



గాయాలపాలైన ట్రాక్టర్‌లోని ప్రయాణికుడు కృష్ణ

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



నరసరావుపేట రూరల్: మండలంలోని కాకాని గ్రామ సమీ పంలో గల జేఎన్‌టీయు క్యాంపస్‌లో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నా మట్టి–నా దేశం కార్యక్రమంలో భాగంగా గురువారం మొక్కలు నాటారు. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సీహెచ్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శోభన్‌బాబు మాట్లాడుతూ మొక్కలు మానవులు, జంతువులకు చాలా సహాయకారిగా ఉంటాయన్నారు. మొక్కలు ఔషధ గుణాలకు కూడా కలిగి ఉంటాయన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపా డుతూ ఆహారం, ఆక్సిజన్ అందిస్తాయన్నారు. కాకాని గ్రామంలో మాజీ సైనికు లు, సర్పంచ్, వార్డు మెంబర్లులను సన్మానించారు. కాకాని గ్రామ సర్పంచి దుర్గాప్రసాద్, దండా వీరాంజనేయులు, కళాశాల మెకానికల్ విభాగ అధిపతి ఐ.ఫణిసుష్మా, ఎలక్ట్రానిక్స్ విభాగ అధిపతి డాక్టర్ ఎ.గంగాధర్, ఎలక్ట్రికల్ ప్రాజెక్ట్ ఇంజనీర్ డాక్టర్ కె. విమల్‌కుమార్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జీపీ.రాజు, టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ స్టాఫ్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

మణిపూర్ హింసను ఖండించండి

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు
- వినుకొండలో ర్యాలీ

వినుకొండ (నూజండ్ల): భిన్నత్వంలో ఏకత్వం కలిగిన భారతదేశంలో మైనారిటీలపై దాడులు చేయడమేకాకుండా, అమానుషంగా హత్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు పేర్కొన్నారు. మణిపూర్ సంఘటనలకు నిరసనగా పట్టణంలో గురువారం నిర్వహించిన శాంతి ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రాజ్యాంగం ముందు అన్ని మతాలు సమానమేనని, ఆ రాజ్యాంగాన్ని మన దేశంలో తూట్లు పొడుస్తున్నారన్నారు. అటువంటి మతోన్మాద విధానాలు అవలంభిస్తున్న బీజేపీ రాజకీయ అధికారాన్ని మార్చడమే నేడు ప్రజల ముందున్న కర్తవ్యమన్నారు. పాస్టర్ రోషన్ కుమార్ మాట్లాడుతూ భారతదేశంలో మైనార్టీ ప్రజలైన క్రిస్టియన్ సోదరులపై మారణకాండ చేస్తూ, హత్యలు చేస్తూ, చర్చిలు తగులబెడుతూ దాడులు జరుగుతుంటే, ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్ మాట్లాడుతూ మణిపూర్ మారణకాండపై మాట్లాడాలంటూ పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతుంటే, ప్రధాని మౌనం వహిస్తున్నారని అన్నారు.



శాంతి ర్యాలీలో పాల్గొన్న నాయకులు

ఓటరు సర్వే పారదర్శకంగా ఉండాలి: ఆర్డీఓ

గురజాల: ప్రతి ఇంటికి వెళ్లి బీఎల్‌ఓలు చేపడుతున్న ఓటర్ సర్వేను పారదర్శకంగా నిర్వహించే విధంగా చర్యలు చేపట్టాలని రెవెన్యూ డివిజన్ అధికారి కె.అద్దెయ్య సూచించారు. స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో గురువారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నిర్వహిస్తున్న డోర్ టు డోర్ సర్వేను ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. ఓటర్లు మార్పులు చేర్పులు క్షణ్ణంగా పరిశీలించాలన్నారు. అనంతరం రెవెన్యూ అధికారులతో భూ రీ సర్వేపై సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ రీ సర్వేలో ఎటువంటి పొరపాట్లుకు తావివ్వకుండా జాగ్రత్తగా సర్వే చేపట్టాలన్నారు. అసైన్డ్ భూములు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు.

సర్పంచ్ స్థానానికి ఐదు నామినేషన్లు

పెరికపాడు(క్రోసూరు): మండలంలోని పెరికపాడు పంచాయతీ ఉప ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థి స్థానానికి ఐదు నామినేషన్లు వచ్చినట్లు, అదేవిధంగా పీసపాడు ఆరవ వార్డుకు ఒక నామినేషన్, హసనాబద్‌లో 3 వ వార్డుకు రెండు నామినేషన్లు వచ్చినట్లు పంచాయతీ విస్తరణాధికారి పి.శివరామయ్య గురువారం తెలిపారు. నామినేషన్లు శుక్రవారం స్క్రూట్నీ, 18 వ తేదీ విత్‌డ్రాయల్స్ ఉంటాయని చెప్పారు. పెరికపాడు ఉప ఎన్నికలకు సర్పంచ్‌గా వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఊడల శ్రీధర్ నామినేషన్ వేయగా వైఎస్సార్ సీపీ మండల నాయకులు అశేషంగా పాల్గొన్నారు.

4 వార్డులకు 11 నామినేషన్లు

అచ్చంపేట: మండలంలో ఖాళీ అయిన పంచాయతీ వార్డులకు సభ్యులను ఎన్నుకునేందుకు ఈనెల 19న జరిగే ఎన్నికల నామినేషన్ల స్వీకరణ తుది గడువు గురువారం ముగిసింది. నాలుగు వార్డులకు మొత్తం 11మంది నామినేషన్లు వేశారు. చెరుకుంపాలెం, మాదిపాడు, కొండూరు 10వ వార్డుకు జరిగే ఎన్నికలలో ఒక్కొక్క వార్డుకు 3 నామినేషన్లు వేశారు. కొండూరు 11వ వార్డుకు రెండు నామినేషన్లు వేశారు. శుక్రవారం నామినేషన్లు పరిశీలన, 12న ఉపసంహరణ, 14న తుదిజాబితా ప్రకటించి 19న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.శివసుబ్రమణ్యం తెలిపారు.

ఒప్పిచర్లలో పొలం బాటల అభివృద్ధి

కారెంపూడి: మండలంలోని ఒప్పిచర్ల గ్రామంలో పొలం బాటల అభివృద్ధి పనులను వైఎస్సార్ సీపీ గ్రామ నాయకుల ఆధ్వర్యంలో రైతులు గురువారం చేపట్టారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పంపిన పొక్లెయినర్, టిప్పర్ల సాయంతో రైతులు పొలం బాటలను అభివృద్ధి చేసుకునే పనులు ప్రారంభించారు. గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ పంగులూరి చినవెంకటనర్సయ్య, గ్రామ సర్పంచ్ ఇరికెదిండ్ల రమణ కొండలు, మాజీ ఎంపీటీసీ ఓగూరి రామయ్య తదితరులు కొబ్బరి కాయలు కొట్టి పనులను ప్రారంభించారు. గ్రామంలో తొమ్మిది పొలం బాటలున్నాయని, వాటికి ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించి బాటలకు గ్రావెల్ తోలి చదును చేయనున్నారు. ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సహకారంతో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు ప్రత్యేక శ్రద్ధతో పొలం బాటలను అభివృద్ధి చేస్తున్నారని మాజీ ఎంపీపీ చినవెంకటనర్సయ్య ఈ సందర్భంగా పేర్కొన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న నాయకులు